
# మిడ్‌నైట్ ఛానెల్

ఎదురింటిలోనికి కొత్తగా వచ్చిన సుందరాంగిని చాలా సేపటినుంచి పరీక్షగా చూస్తున్నాడు కుమార్. ఆమె నిజంగా అప్సరసల లిస్టులో చేర వలసిన సౌందర్య రాశి! చూసిన కొద్దీ చూడాలనిపించే అద్భుత అవయవ సౌష్టవం. ఎక్కడ వుండాల్సిన ఎత్తు పల్లాలు అక్కడుండటం వల్ల ఆమె మూర్తీభవించిన పాల రాతి శిల్పంలా వుంది.



## సుందరాంగి

బొమ్మిడి అచ్చారావు



ఆమె వయసు ఇరవైకి మించి వుండవు. తెలుపుకి ఎరుపుకి మధ్యనున్న శరీరఛాయ. పొడవుగా, అందుకుతగ్గ లావుతో సమతూకంగా వుంది. అందం ఆమె శరీరంలోని ఏ భాగంలో ఇమిడి పోయి వుందో విడమరచి చెప్పటం కష్టం!

కుమార్‌కి ఓ విషయమింకా నిర్ధారణ కాలేదు. ఆమె కుమారా, శ్రీమతా అన్న విషయం! మెళ్లోను, కాలి వేళ్లలోను కొన్ని సాక్ష్యాధారాలుంటాయి ఆడవారికి. కాని, వాటిద్వారా తెల్సుకుందామంటే దూరానికి స్పష్టంగా కనిపించటం లేదు. పోనీ ఎవర్నయినా అడుగుదామంటే... అమ్మో! తనని ఏదోలా చూస్తారు. తను ఇంతకాలం ఈ వీధిలో ఎంతో బుద్ధి మంతుడిగా ముద్రపడి వున్నాడు. ఒక్కసారిగా తనని దుర్మార్గుడు, రాక్షసుడు అంటూ ముద్దు పేర్లతో పిలుచుకుంటారు...

ఎలా?... ఎలా ఆమె గురించి తెలుసుకోవటం!?

కుమార్ ముఖంలో విద్యుల్లత తళుక్కుమంది. వాళ్లింట్లోనుంచి పనిమనిషి వస్తోంది. తమ ఇంట్లో పనిచేసే రాములమ్మే ఆ పనిమనిషి! ఇహనేం, సమస్య తేలిపోయింది!

రావులమ్మ పెరటివైపు నుంచి ఇంట్లోకి వచ్చింది. అమ్మ దానిక్కావలసిన అంట్లు పడేసింది. అది తలవంచుకుని తనపని సీరియస్‌గా చేసుకుపోతోంది. అమ్మ వంటింట్లో ఉందని నమ్మకంగా రుజువు చేసుకుని నూతి దగ్గర అంట్లు తోముతున్న రావులమ్మ పక్కగా చేరి, ఎలా అడగాలా అని తటపటాయిస్తున్నాడు.

రావులమ్మ ఎందుకో తలెత్తి పైకి చూసి, తనవైపే చూస్తున్న కుమార్‌ని ఆశ్చర్యంగా చూసి, 'ఏంటి బావూ, అంత ఇంతగా సూత్తారు? నా మొకంలో ఏటున్నది?' అనడిగింది అమాయకం ఉట్టిపడేలా.

కుమార్ ఓ వెర్రినవ్వు నవ్వి, ''అదికాదు రావులమ్మా, నిన్నో సంగతి అడగాలి!'' అన్నాడు.

''నన్నా? ఏటి బాబూ అది? నాకు, మీకు సంగతులు ఏటుంటాయ్?'' అన్నది అనుమానంగా చూస్తూ.

కుమార్‌కి అవమానమనిపించింది, ఆమె అలా చూస్తుంటే. ''మరేం లేదు, ఎదురింట్లో పనికి కుదిరినట్టున్నావు, ఎవరుంటున్నారా యింట్లో? ...'' అడగవలసిన విషయం సూటిగా అడగలేకపోయాడు.


''ఓ, ఆ యింటి యిసయమా! అదేంటో గాని బావూ, ఆ యింట్ల ఎంత మందుండారో, ఎవురికెవురు ఏటవుతారో నాకు తెలట్నేదు. ఓ పెద్దామె, వుంకో కుర్రామె ఆపడతారు, అస్తమాల, మదిమద్దిన ఓ బొట్టికాయి, ఓ ముసలాయన- ఆల్లెవలికెవులు ఏటవుతారో తెల్వదు బావూ...'' అని రావులమ్మ ఇంకా ఏదో చెపుతుండగానే అమ్మ పెరట్లోకి రావటం చూసి, అక్కడ నుంచి ఉడాయించాడు కుమార్.

రావులమ్మ నుంచి సరైన ఇన్ఫర్మేషన్ రాలేదు. తన ప్రయత్నాలేవో తను చేసుకోవాలి. బొట్టిగాడెవడో ఉన్నాడందింది గదా, వాడ్ని మచ్చిక చేసుకోవాలి! తనూ చూశాడు- ఓ ఎనిమిది తొమ్మిదేళ్ల కుర్రాణ్ణి. బహుశా ఆ అప్సరసకి తమ్ముడేమో!

ఆ సాయంత్రం ఆ అమ్మాయి వాకిట్లో నీళ్లు చల్లి ముగ్గులేస్తోంది. ఆమె ఒంగినపుడు, మెడని ఒరుసుకుంటూ నేలమీద దాదాపు జీరాడుతున్నట్టు వేలాడుతున్న నల్లతాచులాంటి జడ! జాకెట్టును, దాని లోపలి పరువాలను సగం మూసి సగం చూపుతున్న పమిట చెంగు రెపరెపలు, ఆ భంగిమలో ఆమె నడుము దగ్గర సన్నగా బంగారు తీగెలా కనిపిస్తున్న మడత, ఆమె సన్నని పొడవైన మృదువైన చేతులు, ముగ్గులేస్తున్న వేళ్ల నాజూకుతనం - అన్నీ అతనికి మనోహరంగా దర్శనమిస్తుంటే రాశి పోసినట్టున్న సౌందర్యాన్ని రెండు కళ్లతోను జుర్రుకుంటున్నాడు కుమార్.

ఎందుకో అనుకోకుండా ఓసారి తనవైపు చూసిందామె. అంతే! గుండె ఝల్లుమంది. ఆమె చూపుల్లో కోపమో, తిరస్కారమో, సంస్కార హీనంగా చూస్తున్న తనకి హెచ్చరికో- ఏదో భావం అర్థం కాకుండా ప్రతిఫలించింది.

చటుక్కున ముఖాన్ని న్యూస్‌పేపర్లో దాచేసుకున్నాడు కుమార్. కొద్ది క్షణాల తర్వాత పేపరు మాటు నుంచి దొంగచాటుగా చూశాడు.



## కార్గిల్ యుద్ధ స్ఫూర్తితో 'రవన్న'

కార్గిల్ పోరాటంలో ఎందరో సైనికులు వీరోచితంగా పోరాడి స్వర్గస్థులైతే, మరెందరో అంగవికలురైనారు. అలాంటి సైనికుడిని స్ఫూర్తిగా తీసుకుని రూపొందిస్తున్న చిత్రమే రవన్న. దీనికి సరైన హీరో రాజశేఖర్. 'శివయ్య' హిట్ పెయిర్ రాజశేఖర్, సంఘవి ఇద్దరితో బాటు చక్కని నటి సౌందర్య కూడా నటిస్తోంది. వాస్తవానికి అతి దగ్గరలో ఉండి ప్రతి మనిషి హృదయాన్ని కదిలించగల పాత్ర 'రవన్న'లో డా. రాజశేఖర్ తన అభిమానులని అలరించబోతున్నారు.

కాని, అక్కడ ఆమెలేదు. వీధితలుపులు కూడా మూసేసుకుంది. ముగ్గురు అసంపూర్తిగా ఉండి పోవటాన్ని అప్పుడు గమనించాడు. తను నిర్లజ్జగా ఆమెను చూడటం గుర్తించి కోపంతో లోనికి వెళ్లి పోయిందన్నమాట!

ఛ, ఎంత పొరపాటు చేశాను! శాశ్వతంగా తనను ఆమె అసహ్యించుకునేలా ప్రవర్తించాడు. ఎంత సిగ్గు మాలిన తనం! పశ్చాత్తాపంతో చాలా సేపు అలాగే ఈజీ ఛెయిర్లో కూచుని వుండిపోయాడు కుమార్.

ఎవరో తట్టి పిలవటంతో ఉలిక్కిపడి చూశాడు కుమార్. తన కళ్లని తనే నమ్మలేకపోయాడు. ఎదురుగా నిల్చున్నది ఆ బొట్టికాయ! ఆమె తమ్ముడు.

''ఏం బాబూ, ఏం కావాలి?'' అడిగాడు చాలా ఆత్రంగా.

''ఏవైనా మేగజైన్స్ వుంటే ఇమ్మన్నారు మా అమ్మగారు'' అన్నాడా కుర్రాడు.

కుమార్ తలగోక్కున్నాడు.

''మీ అమ్మగారా! అలాగే ఇస్తాను బాబూ! ఇందాక ముగ్గేస్తున్న అమ్మాయి మీ అక్కా?!'' మెల్లగా మాటల్లోకి లాగాడు.

ఆ కుర్రాడు అనుమానంగా చూశాడు కుమార్ వంక.

''ఆమే మా అమ్మగారు!'' అన్నాడు కుర్రాడు.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు కుమార్. మారు మాట్లాడకుండా మేగజైన్స్ రెండిచ్చి పంపాడు.

అంటే... అంటే... ఆ అమ్మాయి- అమ్మాయి కాదన్నమాట!... అమ్మ!... ఆ కుర్రాడి తల్లా!? నిండా ఇరవయ్యేళ్లు ఉండవనుకున్నాడు. దాదాపు తొమ్మిదేళ్ల కుర్రాడికి తల్లా? ఉహు! కానేకాదు. ఆమెలో పెళ్లయిన ఛాయలెక్కడా కనిపించలేదు. ఇంకా అప్పుడే యవ్వన ప్రాంగణంలోకి అడుగు పెట్టిన జవ్వనిలా ఉంటుంది, ఓ బిడ్డకు తల్లా?! అయినా, ఆ కుర్రాడెందుకో, అబద్ధం చెపుతున్నాడనిపిస్తోంది.

మరి... అక్కని పట్టుకుని ఎవరైనా తల్లి అని చెప్పుకుంటారా? నిజంగానే ఆమె ఆ కుర్రాడి తల్లేమో...! నో, నో! ఆ ఆలోచనే భరించలేక పోతున్నాడు కుమార్.

ఆ మర్నాడు రావులమ్మని ఒంటరిగా ఉండగా చూసి మెల్లగా కూపీ లాగాడు.

''ఏం రావులమ్మా, ఆ కుర్రాడు ఆ అమ్మాయి కొడుకట గదా!?'' అన్నాడు బలవంతాన ఆసక్తిని అణచుకుంటూ.

''ఏ కుర్రోడు బావూ, ఎవురి గురించి అడుగుతుండారు?'' అనడిగింది రావులమ్మ.

దీంతో ఇదో బాధ, ఏదీ వెంటనే అర్థమై చావదు - అనుకుని, ''అదే ఎదురింట్లో బొట్టికాయ...'' అన్నాడు అర్ధోక్తిలో ఆపేస్తూ.

''ఓ...'' అంటూ పడీ పడీ నవ్వింది రావులమ్మ. ''ఏటి బావూ, తవురు కూడా మా భాసలో మాట్టాడతా వుండారు?...'' అంటూ మళ్లీ నవ్వింది.

ఇంతలో ఈ హడావుడికి అమ్మ పెరట్లోకి తొంగి చూసింది.

''అమ్మో, అమ్మ చూసేసింది'' అనుకుంటూ హడావుడిగా నూతి దగ్గర కాళ్లు కడుక్కుంటున్నట్టు నటించాడు కుమార్.

రావులమ్మనింకా అలాగే నవ్వుకోనిచ్చి లోలోపల తిట్టుకుంటూ ఇంట్లోకి వచ్చేశాడు.

ఎదురింట్లోకి చూశాడు. ఆ సుందరి గుడికి కాబోలు బయల్దేరుతోంది. ఇదే మంచి అవకాశం! అదేదో ఆమెనే డైరెక్టుగా అడిగేస్తే సరి- తేలిపోతుంది.

హడావుడిగా చెప్పులు వేసుకున్నాడు.

''అమ్మా... అలా బయటికి వెళ్లొస్తా!'' అంటూ వీధిలోకి ఉరికాడు కుమార్. అప్పటికే ఆమె, ఆ కుర్రాడు చాలాదూరం వెళ్లిపోయారు.

ఊరికి కొంచెం దూరంగా ఉంది అమ్మవారి గుడి! ఆ నవయవ్వని ఆ బొట్టికాయతో గుడిలోకి ప్రవేశించే సమయానికి తనూ అక్కడికి చేరుకున్నాడు.

భక్తిగా అమ్మవారికి నమస్కరించుకున్నాడు.

''అమ్మా, అర్చన ఎవరి పేరున చేయించమన్నారు?'' అడిగాడు పూజారి.

''రావూరి రఘునాథ్...'' చెప్పిందామె.

''గోత్రం...?'' అడిగాడు పూజారి.

చెప్పిందామె.

పూజారి గోత్రనామాలతో అర్చన చేస్తున్నాడు. తర్వాత బయటకొచ్చి, ''ప్రసాదం తీసుకోండి బాబూ! అమ్మా, మీరిలా వచ్చి అబ్బాయి పక్కన నించోండి'' అన్నాడు.

ఒక్కక్షణం ఇద్దరూ తెల్లబోయారు. ఆమె కుమార్ కళ్లలోకి చురుగ్గా కోపంగా చూసింది.

కుమార్ క్షమించమన్నట్టు ఆమెవంక చూసి, ''పూజారి గారూ!... ఆమె, నేను వేరు వేరు''

అన్నాడు.

పూజారి తన పొరపాటుకు నాలుక్కొరుకుని ''మన్నించండమ్మా... తెలియక పొరపాటున...'' అంటూ కంగారు పడిపోయాడు.

''ఫరవాలేదు లెండి...'' అన్నదామె.

కుమార్ పూజారి అందించిన ప్రసాదం తీసుకుని హడావుడిగా ఆలయ ప్రాంగణంలోనికి వచ్చేశాడు - ధ్వజస్తంభం తాకి కళ్లకద్దుకొని, విశాలమైన దేవాలయ ప్రాంగణంలో నున్నగా వున్న గట్టుమీద కూచున్నాడు. ప్రశాంతమైన వాతావరణం, రకరకాల పూలచెట్ల నుంచి పరిమళాలు అలనల్లన గాలిలో తేలివస్తూ వారిరువురినీ చల్లగా తాకి వెళ్తున్నాయి.

ఆమె కుర్రాడితో ఓ పక్కగా కూచున్నది.

కుమార్ ఆమెవైపు జరిగి, ''క్షమించండి, పూజారి గారు! తెలియక అన్న మాటలకు అన్యథా భావించకండి'' అన్నాడు.

ఆమె మెల్లగా నవ్వేసి, ''నేనా విషయం అప్పుడే మరచిపోయాను'' అన్నది చల్లగా.

కుమార్‌కి ధైర్యం వచ్చింది. ఫరవాలేదు, ఆమె స్నేహ పూర్వకంగానే మాట్లాడుతోంది. ఇదే అవకాశం- అసలు విషయం రాబట్టడానికి!

ఏమని మొదలు పెట్టాలి?... నిన్న ముగ్గు వేస్తుండగా చూసినందుకే కోపించింది. ఇప్పుడా విషయం అడిగితే ఇంకేమైనా వుందా? అపర కాళిలా విరుచుకుపడదూ!

''ఏం చేస్తున్నారు? చదువా, ఉద్యోగమా?'' అడిగిందామె.

''రెండేళ్లుగా ఉద్యోగం చేస్తున్నానండి బ్యాంక్ క్లర్కుగా!'' చెప్పాడు కుమార్.

''సాయంత్రం ఇల్లు కదలకుండా గుమ్మంలోనే కూచుని కాలక్షేపం చేస్తుంటారన్నమాట!''


''ఆ... ఆ, అవునండి... బ్యాంక్ నించి సరాసరి ఇంటికే వచ్చేస్తాను. వేరే వ్యాపకాలేం లేవండి!''

''ఓహో, మంచి అలవాటే!'' అన్నది.

''ఈ బాబు...?!...''

''చాలా అల్లరివాడండీ.. ఫోర్త్ చదువుతున్నాడు. వస్తామండీ, ఆలస్యమైంది'' ఆమె కుర్రాడితో కదిలి వెళ్లిపోయింది.

ఛ, మళ్లీ అవకాశం తప్పిపోయింది. ఆమెగురించి అడిగితే బావుండేది. సరాసరి బాబు గురించి, అదీ పూర్తిగా అడక్కుండా ఆగిపోయి, చాలా తప్పు చేశాను అని తనను తాను నిందించుకున్నాడు కుమార్.




ఆ రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు. ఏం ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఎప్పుడో నిద్ర పట్టింది.

... ఎవరో తలుపు తట్టినట్టనిపించి, చటుక్కున నిద్ర నుంచి లేచి తలుపు తెరిచాడు.

ఒక్కసారిగా మల్లెల గుభాళింపు ఆ గది నిండా పరచుకుంది. ఉక్కిరి బిక్కిరైపోయాడు కుమార్.

ఎదురుగా ఆ సుందరాంగి!

తన కళ్లను తనే నమ్మలేకపోయాడు కుమార్.

''మీరు... మీరు... ఇంతరాత్రి వేళలో... నా గదికి...'' మాటలు మింగేశాడు.

ఆమె ముగ్ధ మనోహరంగా నవ్వింది. పరవశంతో తనని తాను మరచిపోయాడు కుమార్.

ఆమెనలా చూస్తూ తనని తానదుపు చేసుకోలేక పోతున్నాడు.

''మీకు... మీకు నేనంటే ఇష్టమేనన్నమాట!''

ఆ రెండు మాటలు ఎలా అనగలిగాడో తెలీదు.

''అవును. రోజూ మిమ్మల్ని చూస్తుంటాను. మీ వ్యక్తిత్వం నాకు నచ్చింది. మీరంటే ఏదో తెలియని ఆత్మీయత, ఆరాధన నాలో నానాటికీ పెరుగుతున్నాయి... అందుకే ఈ రాత్రివేళ ధైర్యం చేసి వచ్చేశాను.''

''నాక్కూడా మీరంటే చాలా ఇష్టం... మిమ్మల్ని పెళ్లి చేసుకుంటే... అని చాలా సార్లనుకున్నాను... కాని మీకిదివరకే పెళ్లయిందని, బాబు కూడా వున్నాడని...'' ఆమె ముఖంలో రంగులు మారటం చూసి ఆపేశాడు.

''అవునండీ ... మావారు నన్ను వదిలేశారు. ఆయనకు లేనిఅలవాటు లేదు. ఆయన అవసరాలకి మా వాళ్లు డబ్బు ఇవ్వలేకపోయారు. దాంతో నువ్వు నాకొద్దని పుట్టింటికి పంపేశారు. బాబుతో మా అమ్మగారింట్లో జీవచ్ఛవంలా బతుకుతున్నాను...''

కుమార్ చలించిపోయాడు.

''మీ పేరు...?!''

''లావణ్య''

''పేరుకు తగ్గ రూపం, రూపానికి తగ్గపేరు. చూడు లావణ్యా, నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నిన్ను పెళ్లి చేసుకుని తీర్తాను. నీ బిడ్డ ఇక మీదట మనబిడ్డ. నన్ను నమ్ము.''


ఆమె కళ్ల నుంచి ఆనందభాష్పాలు!

''నిజంగా మీరు దేవుడు. ఇన్నాళ్లు మీరు నా బాహ్యరూపం చూసి మోహిస్తున్నారనుకున్నాను... కాని మీరు నన్ను మనసారా ఆరాధిస్తున్నారని గ్రహించాను. మీరెంత మంచివారండీ...'' అతని పాదాల నంటి నమస్కరించింది.

కుమార్ ఛాతీ ఉద్రేకంతో పొంగింది. ఆమెను రెండు చేతులతోను లేవనెత్తి చటుక్కున గుండెలకు హత్తుకున్నాడు. ఆమె మరింతగా అతన్ని బల్లిలా కరచుకుపోయింది.

''లావణ్యా... ఐ లవ్ యూ...'' అన్నాడామె చెవిలో.

''మిమ్మల్ని ఆరాధిస్తున్నాను కుమార్... మీరు లేకుండా ఒక్క క్షణం కూడా వుండలేను'' అన్నదామె.




ఇద్దరి శరీరాల్లోనూ ఏదో తెలియని తపన, ఆర్తి సన్నగా ప్రకంపిస్తున్నాయి.

కుమార్ ఆమె ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని ప్రేమగా, కోరికగా ఆమె కళ్లలోకి చూశాడు. ఆమె కళ్లు లజ్జా భారంతో నేలవాలిపోతున్నాయి. ఆ కనురెప్పల మీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమె పరవశించిపోయింది. ఆమె చెక్కిళ్లను పెదాలను గడ్డాన్ని ముద్దులతో తడిపేశాడు.

అతని ప్రతీ చర్యకు ఆమె స్పందిస్తోంది. అతన్ని మరింతగా ఇంకా గాఢంగా హత్తుకు పోతోంది.

ఆమెను మెల్లగా పరుపు దగ్గరకు నడిపించుకుని వెళ్లాడు. ఇద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలతోను గదంతా వేడెక్కిపోయింది. తెల్లని పక్క వారిద్దర్నీ ఆహ్వానిస్తోంది. ఆమెను పక్కమీదకు చేర్చి ఆర్తిగా తమకంగా ఆమె మీదికి ఒరిగాడు కుమార్.

అప్పుడే ఈలోకంలోకి వచ్చిన దానిలా ''కుమార్ ... ఇదేమిటి? మనం హద్దు మీరిపోతున్నాం... పెళ్లయ్యే వరకు...'' ఆమె మరి మాట్లాడలేకపోయింది.

''నిన్ను రేపే అందరి సమక్షంలో వివాహం చేసుకుంటాను లావణ్యా! నామీద నమ్మకం లేదా?''

''ఛ, మిమ్మల్ని నమ్మకపోతే 'నమ్మకం' అన్న మాటకు అర్థమే మారిపోతుంది. మీరు నన్నెప్పటికీ అన్యాయం చెయ్యరు. ఇంతరాత్రిపూట మీ గదికి ఎందుకొచ్చాను? మిమ్మల్ని నమ్మబట్టే కదా...!

ఆ తర్వాత ఇక వారిద్దరి మధ్య మాటల్లేవు. కుమార్ ఆమెను ఆక్రమించుకునే ప్రయత్నంలో మంచం చివరకు జరిగి, దభేలున మంచం మీది నుండి నేలమీద పడిపోయాడు.

-చటుక్కున మెలకువ వచ్చింది కుమార్‌కి.

గదిలో డిమ్‌లైట్ వెలుగుతోంది. తలుపులు లోపల బంధించి వున్నాయి. మల్లెల పరిమళమూ లేదు, మదవతీ లేదు. తనొక్కడే గదిలో వున్నాడు. అదీ నేలమీద పడిపోయి వున్నాడు.

అయితే ఇదంతా... కలా? అంటే లావణ్య తన గదికి రాలేదా? అసలు ఆమె పేరు లావణ్యేనా? ఆ పేరు తను కలలో ఊహించుకున్న పేరా?

ఛ, ఆమెతో కల్లో తను చాలా అసహ్యంగా ప్రవర్తించాడు అంటే... తనామె శరీరాన్ని కోరుకుంటున్నాడు. ఆమెపట్ల కోరికను పెంచుకుంటున్నాడు. ఛీ, తనెంత సంస్కార హీనుడు? పరాయిస్త్రీ- అందునా వివాహిత స్త్రీ గురించి ఇంత నీచంగా ఆలోచించటం చాలా అమానుషం!

కుమార్ ఆ రాత్రంతా మేలుకునే వున్నాడు.

మర్నాడు ఎదురింటి వైపు చూడటానికి సిగ్గుపడ్డాడు.

బ్యాంక్‌కి వెళ్తూ అనుకోకుండా ఎదురింటి వైపు చూశాడు. ఎవరో ఓ మగవాడు, స్త్రీ- రిక్షా ఎక్కుతున్నారు. వారివెంట ఆ బొట్టికాయ కూడా ఎక్కాడు. ఆ స్త్రీ ముమ్మూర్తులా 'లావణ్య', - అదే - సుందరాంగి లాగానే వుంది. వాళ్లు ఎప్పుడొచ్చారో తను చూడలేదు. అప్పుడే వెళ్లిపోతున్నారే...! వారి వెంట ఆ బొట్టికాయ కూడా వెళ్లిపోతున్నాడా?

'లావణ్య' బయటికొచ్చి వాళ్లకు వీడ్కోలు చెపుతోంది. కుమార్‌ని చూసి చిన్నగా పలకరింపుగా నవ్వింది. కుమార్‌కి రాత్రి తనకొచ్చిన కల గుర్తొచ్చింది. ఆమె వైపు చూడటానికే బిడియం వేసింది. ఆమె పట్ల తను చాలా అసభ్యంగా ప్రవర్తించాడు - కల్లో. నైతికంగా తను చాలా దిగజారిపోయాడు.

సాయంత్రం కుమార్ బ్యాంక్ నించి తిరిగొచ్చేసరికి తమ ఇంట్లో ఎవరో కొత్త మనుషులున్నట్టు గుర్తించాడు. అందులో ఒకామె ఎదురింట్లో వుండే నడివయసామె. వెనుతిరిగి వున్న అమ్మాయిని లావణ్యగా గుర్తించాడు.

'లావణ్య' కుమార్‌ని చూసి సన్నగా నవ్వింది.

ఆమె కళ్లలో కోటి జ్యోత్స్నలు!

''వస్తామండీ!'' అని చెప్పి నడివయసామె లేచింది వెళ్లటానికన్నట్టు. కుమార్ వంక ఓరగా చూస్తోందామె. లావణ్య కూడా అమ్మకు నమస్కారం చెప్పి, వీడ్కోలు తీసుకుంది.

వాళ్లు వెళ్లే వరకు అటే చూస్తుండి పోయిన అమ్మ కుమార్ వంకచూసి, ''ఆ పిల్ల ఎలా వుందిరా నానీ!'' అనడిగింది.

''ఎవరమ్మా?... లావణ్యా?..'' అన్నాడు పరాకుగా కుమార్.

''లావణ్యా?!... ఆమె ఎవరు? ఈ పిల్లపేరు చక్కగా 'సౌందర్య' అయితేనూ... మన ఎదురింట్లో వుంటున్నారు కదా! ఆ పెద్దామె ఆ అమ్మాయి తల్లి. వాళ్ల నాన్నగారు ఫుడ్ కార్పోరేషన్‌లో పని చేస్తున్నారు. వాళ్లు మన వాళ్లే!... నీకు ఆ పిల్లకు ఈడుజోడుగా వుంటుందని అందరం ఓ నిర్ణయానికొచ్చాం. రేపు వాళ్ల నాన్నగారు మీ పెళ్లి విషయం మీ నాన్నగారితో మాట్లాడటానికి వస్తారట. ఆ పిల్ల నాకు చాలా బాగా నచ్చింది. నీకు నచ్చితే చెప్పు. వెంటనే ముహూర్తం పెట్టించేస్తాం'' అమ్మ వాక్ప్రవాహం ఆగేలా కనిపించలేదు.

''అమ్మా... ఆ అమ్మాయికి... పెళ్లి కాలేదా? ... మరి, ఆ చిన్న కుర్రాడెవరూ...'' మాటలు మింగేశాడు కుమార్- అమ్మ తనవైపు విస్తుపోయి చూడటం గమనించి.

''నువ్వు స్పృహలో వుండే మాట్లాడుతున్నావా? ఆ అమ్మాయికి పెళ్లి కావటమేమిటి? ఆ కుర్రవెధవ సౌందర్య అక్క కొడుకు. ఇందాకనే వాళ్ల అక్కాబావలతో వెళ్లిపోయాడు. వాళ్లది నిడదవోలు...'' అమ్మ ఇంకా ఏదో చెపుతూనే వుంది.

కాని కుమార్ మనసక్కడలేదు. సౌందర్య మనసును వెతుక్కుంటూ వెళ్లిపోయింది.